క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక కేజీబీవీలో ఆరు, ఏడు, ఎనిమిదో తరగతులతో పాటు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ నజీయా ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఏడో తరగతిలో ఐదు, ఎనిమిదో తరగతిలో మరో ఐదు సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక పట్టణంలోని వాసవీనగర్, విద్యానగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడి మురుగు కాలువల సమస్యలు, పారిశుద్ధ్య పరిస్థితులపై స్థానికులతో మాట్లాడారు. వాడుక నీటిని నేరుగా ఆరుబయటకు విడిచిపెట్టి, ఇతరులకు అసౌకర్యం కల్పించకూడదని సూచించారు. మురుగు కాలువలు కావాల్సిన ప్రాంతాల్లో వినతిపత్రాలు అందిస్తే మురుగు కాలువలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామ సత్యసాయిబాబా భజన మండలి సభ్యులంతా కలిసి రాజాం–రామభద్రపురం రోడ్డులో గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఏటా వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు తామంతా కలిసి పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

సచివాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మెంటాడ: మండలంలోని మీసాలపేటలో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి సర్పంచ్ మహంతి రామునాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన కొనసాగిస్తున్నారని, అందులో భాగంగానే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

రేగిడి: సచివాలయ ఉద్యోగులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. గురువారం మండలంలోని అంబాడ, పెద్దశిర్లాం గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆయన విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని, సమస్యతో సచివాలయానికి వచ్చే గ్రామస్తులను సాదరంగా ఆహ్వానించి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రామభద్రపురం: రంజాన్ మాసం పురస్కరించుకుని, మండలంలోని కొట్టక్కి గ్రామంలో పలు నిరుపేద ముస్లిం కుటుంబాలకు జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి చేతుల మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ మైనార్టీ సభ్యులు రియాజ్‌ఖాన్, అన్వర్ భాషా గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.అనురాధ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

వంగర: మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొండ చాకరాపల్లి గ్రామంలో పాడైన మొక్కజొన్న పంటను ఏఓ ప్రభాకరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు, రైతు సంఘం నాయకులు కలిసి, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు కె.చిట్టిబాబు, కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వీఏఏలకు శిక్షణ

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామ రైతు భరోసా కేంద్రంలో వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు)లకు మట్టినమూనాల సేకరణ, నాణ్యత పరిశీలనపై గురువారం శిక్షణ ఇచ్చారు. రాజాం వ్యవసాయ శాఖ ఏడీ కొల్ల చంద్రరావు మాట్లాడుతూ ఈ వేసవిలో పొలాలకు వెళ్లి, మట్టి నమూనాలు సేకరించాలని, అనంతరం వాటి నాణ్యత పరిశీలించాలని తెలిపారు. నాణ్యత బట్టి పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంతకవిటి వ్యవసాయాధికారి పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



రేగిడి: కాగితాపల్లిలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లతో గ్రామస్తులు



రాజాం: మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రామభద్రపురం: చొక్కాపు వీధిలో మండల జేసీఎస్ సింహాచలంనాయుడు ప్రచారం



సంతకవిటి: తాలాడలో జగనన్నే మా భవిష్యత్‌–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ ప్రచారం



తెర్లాం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు



బొబ్బిలి: ఎనిమిదో వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు



బాడంగి: రేజేరులో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న వైస్ ఎంపీపీ రమేష్



వంగర: వీవీఆర్‌పేటలో గృహసారథులకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ విజయలక్ష్మి

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



దివ్యాంగులకు త్రిచక్ర స్కూటీలు అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రాజాం: దివ్యాంగుల అభ్యున్నతి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద దివ్యాంగులకు పంపిణీ నిమిత్తం ఆలిమ్–కో సంస్థ ఏర్పాటు చేసిన ఉపకరణాల శిబిరాన్ని వారు గురువారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందుకు తగ్గట్టుగా పలు ప్రాంతాల నుంచి ఆరోగ్య సంస్థలు వచ్చి, ప్రజలకు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఈ రాష్ట్రంలో జరుగుతున్నన్నీ ఆరోగ్య శిబిరాలు ఏ రాష్ట్రంలోనూ జరగడం లేదన్నారు. దివ్యాంగులు ఈ శిబిరాలను సద్వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ దివ్యాంగునికి ఇక్కడే వైద్య తనిఖీలు చేసి, పరికరాలు అందిస్తారన్నారు. ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చొరవతో ఈ శిబిరం నిర్వహించడం జరుగుతోందన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తోందన్నారు. హైదరాబాద్‌కు చెందిన భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రముఖ కృత్రిమ అవయవ తయారీ కేంద్రం(ఆలిమ్–కో) రూ.4 కోట్లు విలువ చేసే ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ ఢిల్లీ నుంచి వైద్య బృందం ఇక్కడికి వచ్చిందని, వారికి సహకారం అందించేందుకు జిల్లాలోని పలు విభాగాలు నుంచి 30 మంది ఉద్యోగులు ఓ కమిటీగా ఏర్పడి ఇంతపెద్ద కార్యక్రమం చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం ఓ యూనిట్‌గా ఈ శిబిరాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విజయనగరం జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో మాత్రమే ఈ శిబిరాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం తొమ్మిది మంది దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు(స్కూటీ) ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కలిసి అందజేశారు. రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వారీగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, విభిన్న ప్రతిభావంతుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయించారు. మొత్తం 450 మందికి పైగా దివ్యాంగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, పి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, ఎంపీడీఓలు బి.శంకరరావు, ఎస్.రఘునాధాచారి, జి.కాశీవిశ్వేశ్వరరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో 'సంక్షేమ' కాంతులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



బొద్దూరులో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు

సంతకవిటి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ గడపలో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండలంలోని బొద్దూరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటిటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఏవైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అక్కడి అధికారులను ఎమ్మెల్యే ఆదేశించగా, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం జగనన్న తన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటివరకు దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. పేదల ప్రగతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ జగన్ సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఒకప్పుడు ఏ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజల ప్రతీ సమస్య పరిష్కారమవుతుండడంతో గ్రామస్తులు సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. జగన్‌మోహన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, సర్పంచ్ జి.బాబూరావునాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీటీసీ మురళీకృష్ణ, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది..

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా తాము ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని అడుగుతూ గోడలకు స్టిక్కర్లు అతికిస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మతిభ్రమించి, మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన గతంలో ఇదే చంద్రబాబు ఆయన ఫొటోతో ఉన్న ఇనుపరేకులను గోడలకు అతికించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో ఆయన ఏ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించినా ఆయన మాటతీరు చూస్తే ఆయనకు మతిపోయిన విషయం ఇట్టే అర్థమైపోతుందన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయంలో అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల ద్వారా ప్రజల్లో వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఆయన లేనిపోని అవాకులు చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లోనూ ఇదే జగనన్న ప్రభుత్వం రావడం ఖాయమని జోష్యం చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని పదో వార్డులో గురువారం పర్యటించిన ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించగా, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు చేరుస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. గ్రామంలోని సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు అనేకరకమైన సేవలందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకంలో చూసినా అవినీతి ఉండేదని, ఇప్పుడు అమలు చేస్తున్న పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఐ.గోపాలరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రచార భేరి' పోస్టర్ ఆవిష్కరణ

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ వద్ద ప్రచారి భేరి కార్యక్రమ పోస్టర్‌ను సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఒమ్మి రమణ, తమ్మినేని సూర్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు చేపట్టనున్న ప్రచార భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. దేశంలోని అడవులు, భూములు, విద్యుత్ ప్రాజెక్టులు, గనులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని దుయ్యబట్టారు. నిత్యావసర సరుకుల ధరలతో పాటు పెట్రోలు, డీజిలు ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందని విమర్శించారు.

సంక్షిప్తంగా...

వివాహిత మృతిపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధిలోని కంచరాం గ్రామానికి చెందిన కొండక లత(32) మృతిపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్ఐ వీబీ రామకృష్ణ తెలిపారు. గత కొంతకాలంగా నిద్రపట్టకపోవడంతో అనారోగ్యానికి గురైన లత మందులు వాడుతోంది. అయినా సమస్య తీరకపోవడంతో మానసిక ఆందోళనకు గురై, బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి, వీఆర్‌ఓ నాయుడు శ్రీనివాసరావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

బొబ్బిలి: అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ పి.రవీంద్ర సూచించారు. మండలంలోని పారాది గ్రామ సచివాలయాన్ని గురువారం సాయంత్రం సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల పనితీరుపై ఆరాతీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు క్షుణ్నంగా పరిశీలించి, అర్హులైతేనే పథకాలు అందివ్వాలన్నారు.

అంబేడ్కర్‌కు ఘననివాళి

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ జయంతి గురువారం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన ఆయన జయంతి సందర్భంగా పాఠశాల సెలవు కావడంతో ముందురోజు కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు గీతారాణి తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు.

ఘనజీవామృతంతో భూసారం

రాజాం సిటీ: భూసారానికి ఘనజీవామృతం ఘనమైన ఎరువని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. గురువారం మండలంలోని పొగిరి గ్రామంలో రైతులకు ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. రైతులంతా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. అనంతరం ఘనజీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. తొలుత ఆవుపేడ 400 కేజీలు, 2 కేజీల బెల్లం, మరో 2 కేజీల పప్పు దినుసుల పిండి, 10 లీటర్ల ఆవుమూత్రం, తగినంత పుట్టమన్ను తీసుకోవాలన్నారు. తర్వాత పేడలో పిండి, బెల్లం, ఆవుమూత్రం, మన్ను బాగా కలిపి ఉండలుగా గానీ పిడకలుగా గానీ చేసుకుని, ఏడు రోజుల పాటు నీడలో ఆరబెట్టాలని సూచించారు. ఆరిన పిడకలు గానీ, ఉండలు గానీ గోనె సంచులలో నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. వీటిని ఎకరానికి ఆఖరి దుక్కులో 400 కేజీల వరకు వేసుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్ నేలకు లభించి, సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.రమాదేవి, ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ, పి.భారతి, జి.తిరుపతి పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి

వంగర: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన ఆమె గ్రామాల వారీగా పూర్తయిన భూముల రీసర్వే, సర్వే మిగిలి ఉన్న గ్రామాలపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమష్టిగా పనిచేసి, సర్వే పూర్తి చేయాలని తెలిపారు.

రెడ్‌క్రాస్ ఔదార్యం

రాజాం సిటీ: మండలంలోని పొగిరి లెప్రసీ ఆస్పత్రికి 10 మంచాలను అందజేసి, రెడ్‌క్రాస్ ఔదార్యం చాటుకుంది. ఆస్పత్రిలో సరిపడ మంచాలు లేక రోగులు అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు పి.జగన్‌మోహనరావు దాదాపు రూ.లక్ష వ్యయంతో సమకూర్చిన మంచాలను రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్‌లు ఆస్పత్రి వైద్యుడు లింగరాజుకు గురువారం అందజేశారు.

చిన్నారులకు రోగ నిరోధక టీకాలు

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి, ఉంగరాడ, మెట్ట, వండానపేట, కేఎంవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం రోగ నిరోధక మందులు, టీకాలు గురువారం పంపిణీ చేశారు. ఐరన్ లోపం ఉన్న చిన్నారులకు సిరప్‌లు అందించారు.

సమయపాలన పాటించండి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ సూచించారు. గురువారం మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, లక్ష్మీపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఆమె క్రమం తప్పకుండా కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు.

ఏళ్లనాటి కల.. సాకారమైన వేళ...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఓ సాహసోపేతమైన నిర్ణయంతో డీఎస్సీ అభ్యర్థుల ఏళ్ల నాటి కల సాకారమైంది. 1998–డీఎస్సీ అభ్యర్థులకు ఇప్పుడు ఉద్యోగాలు కల్పించడంతో ప్రతీ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గురువారం ఎంఈఓల చేతులమీదుగా నియామకపత్రాలు అందుకున్న వారు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత ఉద్యోగాలు పొందినందుకు ఎంతో సంతోషంగా ఉందని అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ ఎన్నో పోరాటాలు సాగించినా కొలువు దక్కలేదని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పుణ్యమా అని మా కలలు ఫలించాయన్నారు. సర్వదా సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: 1998-డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రం అందజేస్తున్న ఎంఈఓ త్రినాధరావు




రేగిడి: టీచర్ కొలువు పొందిన కొండవలస సర్పంచ్ వెంకటరమణ





తెర్లాం: ఉద్యోగాలు సాధించిన మండలంలోని జన్నివలసకు చెందిన అన్నదమ్ములు



బాడంగి: జెడ్పీటీసీ రామారావు, ఎంఈఓ కృష్ణమూర్తి చేతులమీదుగా జాయినింగ్ ఆర్డర్లు అందుకుంటున్న 1998-డీఎస్సీ అభ్యర్థులు



రామభద్రపురం: ఎంఈఓ తిరుమలప్రసాద్ చేతులమీదుగా నియామకపత్రాలు అందుకుంటున్న 1998-డీఎస్సీ అభ్యర్థులు



రేగిడి: అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో 1998-డీఎస్సీ అభ్యర్థులు



రాజాం సిటీ: ఎంఈఓ నాగయ్యకు జాయినింగ్ ఆర్డర్‌ను అందిస్తున్న నూతన ఉపాధ్యాయులు